సాక్షి నంద్యాల

గురువారం । 17 । అక్టోబర్ । 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు బుధవారం అనకాపల్లికి చెందిన ఎస్.చంద్రమౌళి రూ.1,00,011 విరాళం అందజేశారు.



భ్రామరీకి లక్ష కుంకుమార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబాదేవికి బుధవారం పౌర్ణమి సందర్భంగా లక్షకుంకుమార్చన సేవ జరిపించారు. పరోక్షసేవలో వివిధ రాష్ట్రాల నుంచి 24 మంది భక్తులు పాల్గొన్నారు.



మల్లన్నకు నృత్య నివేదన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై బుధవారం హైదరాబాద్‌కు చెందిన పీఎస్ఆర్‌కే కళాక్షేత్రం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

పవిత్రోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలం ప్రహ్లాదవరద స్వామి ఆలయంలో నాలుగు రోజుల పాటు జరిగే వార్షిక పవిత్రోత్సవాలు ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం విష్వక్సేనారాధనం మృత్సంగ్రహణం యాగశాల ప్రవేశం తదితర పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో సోమకుంభస్థాపనం చేశారు. అనంతరం వేద పండితుల వేదమంత్రోచ్చారణలతో ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. రాత్రి ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదులకు తిరుమంజనం నిర్వహించి పట్టుపీతాంబరాలతో అలంకరించి ప్రత్యేక మండపంలో కొలువుంచి ఆది హోమం నిర్వహించారు.

పవిత్రోత్సవాల్లో నేడు..

పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం వేకువజామున ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు పవిత్రోత్సవ నిత్యపూజలు, కళశ స్నపన, ద్వారాతోరణ పూజ, గ్రామోత్సవం అనంతరం అర్ధరాత్రి హోమం ఉంటాయి.

టెట్‌కు 23 మంది అభ్యర్థులు గైర్హాజరు

నంద్యాల(న్యూటౌన్): జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ మెమోరియల్ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం జరిగిన టెట్‌కు 23 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 100 మందికి గానూ 90 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 100 మందికి గాను 87 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరైనట్లు డీఈఓ తెలిపారు.

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): జిల్లా వైద్య కళాశాలలో డిప్లమా ఇన్ పారా మెడికల్ కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జయమ్మ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటర్మీడియెట్ తత్సమాన విద్యార్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, ఇంటర్ బైపీసీ చదివిన విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు (ఆఫీసు పని దినాల్లో) నంద్యాల వైద్యకళాశాలలో రూ.10 రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోస్టు ద్వారా వచ్చే దరఖాస్తులు స్వీకరించబడవన్నారు. దరఖాస్తులను www.appmb.co.in/appsahpc.co.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈనెల 25న వైద్య కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

శ్రీశైలంలో 211 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయంలో బుధవారం సాయంత్రం సమయానికి 211.9572 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి 73,578 క్యూసెక్కుల వరద ప్రవాహం జలాశయానికి వస్తుండగా ఇక్కడి నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 78,256 క్యూసెక్కులు విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 15.213 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.567 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం డ్యాం నీటిమట్టం 884.40 అడుగులకు చేరుకుంది.

భరోసా కరువు.. సాగు బరువు!

- ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయమంటూ కూటమి నేతల హామీ
- ఖరీఫ్ సీజన్ ముగిసినా నోరుమెదపని వైనం
- 'రైతు భరోసాను' 'అన్నదాత సుఖీభవ'గా మార్పు చేయడం మినహా నిధులు విడుదలపై మీనమేషాలు
- ఆందోళన చెందుతున్న రైతన్నలు

ఎన్నికల వేళ కూటమి నేతలు రైతన్నలకు ఏటా రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందజేస్తామంటూ ఊదర గొట్టారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలవుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నేటికీ రైతులకు పైసా సాయం అందించిన పాపాన పోలేదు. అధికారం చేపట్టిన వెంటనే 'రైతు భరోసా' పథకాన్ని 'అన్నదాత సుఖీభవ' అంటూ పేరు మార్చడం మినహా నిధుల విడుదల ఊసే లేదు. గతంలో వ్యవసాయమే దండగ అన్న చంద్రబాబు సర్కారు.. మరోసారి అదే తీరును కనబరుస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



రబీలో మొక్కజొన్న విత్తనాలు నాటుతున్న కూలీలు

ఆళ్లగడ్డ: జిల్లాలో 28 మండలాల పరిధిలో 3,35,887 మంది రైతులు ఉండగా వ్యవసాయ భూమి 2.50 లక్షల హెక్టార్లు ఉంది. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో రైతులు సంబరంగా వ్యవసాయ పనులు ప్రారంభించారు. ఖరీఫ్ పూర్తి చేసుకుని రబీ సీజన్‌లో పంటల సాగు మొదలు పెట్టారు. ఈ క్రమంలో విత్తనం, పంటల్లో కలుపు తీత, మందులు, ఎరువులు తదితరవాటికి నగదు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంతవరకు సాయం అందకపోవడంతో పెట్టుబడి కోసం కొంత మంది రైతులు బంగారం తాకట్టు పెట్టుకుంటుండగా మరికొందరు అధిక వడ్డీలకు అప్పు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. రైతు భరోసాపై ఎన్నికల్లో ఊదరగొట్టిన కూటమి నేతలు మాత్రం ఇప్పటి వరకు నోరు మెదపడంలేదు. మూడు నెలల క్రితం పీఎం కిసాన్ తొలివిడత సాయం అందించిన కేంద్రం.. తాజాగా ఈనెల 5న రెండో విడత సాయం కూడా విడుదల చేసింది. మరో పక్క 'వైఎస్సార్ రైతు భరోసా' పెట్టుబడి సాయం పేరును 'అన్నదాత సుఖీభవ'గా పేరు మార్చిన సీఎం చంద్రబాబు.. పెట్టుబడి సాయం మాత్రం ఎప్పుడు విడుదల చేస్తారో స్పష్టతనివ్వడం లేదు. రెండో విడత సమయం దాటినా ఇప్పటికీ పెట్టుబడి సాయంపై విధివిధానాలు విడుదల చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇప్పటికే వర్షాలు, వరదలు, తుఫానులతో తీవ్ర నష్టాలు చవిచూసిన అన్నదాతలు ప్రభుత్వం పెట్టుబడి సాయం కూడా అందించకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

గత ఐదేళ్లూ రైతు భరోసా

గత ఐదేళ్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనిచ్చి వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుచేసింది. ఏటా ఖరీఫ్ సీజన్ మొదలయ్యేలోపు మొదటి విడత పెట్టుబడి సాయం రూ.7,500 అందుకున్న తర్వాతనే ఉత్సాహంగా వ్యవసాయ పనులు మొదలు పెట్టేవారు రైతులు. రైతన్నలు ఎవరివద్ద చేయి చాచి అప్పులు అడిగే పరిస్థితి లేకుండా ఖరీఫ్, రబీ సీజన్ల ప్రారంభంలోనే నగదు వారి ఖాతాల్లో జమ అయ్యేది. జిల్లాలో సుమారు 2.34 లక్షల మంది అర్హులైన రైతులకు ఏటా సుమారు రూ.316.25 కోట్ల చొప్పున ఐదేళ్లు సాయం అందించింది.

మూడు విడతల్లో..

ఖరీఫ్, రబీ సీజన్‌లలో రెండు విడతలు సాగుకు ముందు.. మూడో విడత నూర్పిడి చేసుకునేందుకు వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ కింద ప్రభుత్వం ప్రతి ఏటా మూడు విడుతల్లో రూ.13,500 సాయాన్ని అందించింది. రూ.7,500 మే నెలలో, రూ.4 వేలు అక్టోబర్‌లో, మిగిలిన రూ.2 వేలు జనవరిలో అందించింది. భూ యజమానులకు మాత్రమే పీఎం కిసాన్ కింద కేంద్రం మూడు విడుతల్లో రూ.6వేల చొప్పున జమ చేసేది. ఎలాంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన కౌలుదారులతోపాటు దేవదాయ, అటవీ, వక్ఫ్ తదితర ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న, కౌలుదారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కేంద్ర సాయంతో పనిలేకుండా సొంతంగా ఏటా రూ.13,500 చొప్పున అందజేస్తూ అండగా నిలిచింది.

కేంద్రం నిధులు విడుదల

ఇప్పటికే మూడు నెలల క్రితం తొలివిడతగా రైతులకు పీఎం కిసాన్ నిధులు రూ.2 వేలు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం.. తాజాగా ఈ నెల 5వ తేదీ రూ 2 వేలు చొప్పున రెండో విడత సాయం రైతుల ఖాతాల్లో జమ చేసింది. జిల్లాలో 1,45,407 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున రూ.28.040 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఒకవైపు ఖరీఫ్ ముగిసి రబీ మొదలైనా.. రూ.20 వేల చొప్పున సాయం అందిస్తామన్న చంద్రబాబు ప్రభుత్వం మాత్రం మీనమేషాలు లెక్కిస్తూనే ఉంది.

రైతన్నల ఖాతాలకు పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం రెండు విడతల్లో **1,45,407** మంది రైతులకు జమ చేసిన మొత్తం రూ.**56.08** కోట్లు

చంద్రబాబు ప్రభుత్వం అందించిన సాయం : **0**

గత ఐదేళ్లల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా కింద అందించిన సాయం : రూ **1,385.51** కోట్లు

జిల్లాలో గత ఐదేళ్లలో రైతు భరోసా కింద అందిన పెట్టుబడి సాయం

సంవత్సరం	రైతులు	ప్రభుత్వ సాయం (రూ.కోట్లలో)
2019-20	209861	283.31
2020-21	215936	291.51
2021-22	215595	291.05
2022-23	221241	298.67
2023-24	219791	220.97

సాగు కష్టాలు మొదలయ్యాయి



రైతులకు మళ్లీ సాగు కష్టాలు మొదలయ్యాయి. ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ మొదలు పెట్టాం. ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద ఇస్తామన్న రూ.20 వేల పెట్టుబడి సాయంలో నయాపైసా ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వం రెండు విడతల్లో రూ.4 వేలు అందజేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ పెట్టుబడి సాయంపై స్పందించక పోవడం సిగ్గుచేటు.

– రంగస్వామిరెడ్డి, రైతు, బచ్చాపురం

నమ్మించి మోసం చేశారు



ఎన్నికల ముందు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఆ హామీ నెరవేర్చక పోవడం దారుణం. మమ్మల్ని నమ్మించి మోసం చేయడం తగదు. అప్పులు చేసి పంటలు సాగు చేయగా అధిక వర్షాలకు సరైన దిగుబడులు రాలేదు. అరకొర వచ్చిన దిగుబడులు కూడా తడిచి పోవడంతో గిట్టుబాటు ధర లభించడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి. – సావిత్రమ్మ, మహిళారైతు, బాచేపల్లి

సాగుకు భరోసా లేదు



గతంలో ఏటా రూ.13,500 చొప్పున మూడు విడతల్లో నా ఖాతాలో రైతు భరోసా డబ్బు జమ అయ్యేవి. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు సార్లు రూ.4 వేలు మాత్రమే జమ అయ్యాయి. వానకారు పూర్తయి మధ్య కారు పంటలు సాగు చేస్తున్నా. చంద్రబాబు ఇస్తామన్న రూ20 వేలలో నయాపైసా వేయలేదు. తక్షణమే పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి.

– ప్రశాంతంరెడ్డి, రైతు, క్రిష్టిపాడు



రుద్రవరం మండలం మాచినేనిపల్లె సమీపంలో నీట మునిగిన జొన్న పైరు

ముంచెత్తిన వాన

- చాగలమర్రిలో అత్యధికంగా 49.8 మి.మీ వర్షం
- నీటమునిగిన పైర్లు



దొర్నిపాడు సమీపంలో పత్తి పొలంలో నిలిచిన నీరు

నంద్యాల(అర్బన్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో పలు చోట్ల సాధారణం నుంచి భారీ వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేని వర్షం వల్ల పంటపొలాలు నీట మునిగాయి. చాగలమర్రిలో అత్యధికంగా 49.8 మి.మీ, అత్యల్పంగా పగిడ్యాలలో 1.2 మి.మీ వర్షం కురిసింది. ఇక శిరివెళ్ల లో 40, రుద్రవరంలో 30.2, ఆళ్లగడ్డలో 30, ఉయ్యాల వాడ 28.8, బనగానపల్లె 23, సంజామల 22.6, గో స్పాడు 21.2, పాణ్యం, కొలిమిగుండ్ల 20.2, దొర్నిపా డు 19.8 మి.మీటర్ల చొప్పున వర్షం కురిసింది. కాగా వాతావరణ శాఖ సూచనలతో కలెక్టర్ రాజకుమారి వి ద్యాసంస్థలకు బుధవారం అత్యవసరంగా సెలవు ప్రకటించారు. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏ ర్పాటుతోపాటు కమాండ్ కంట్రోల్ రూం ఫోన్‌నెంబర్లు 08514-293903, 293908లను ఏర్పాటు చేశారు.

దెబ్బతిన్న పంటలు..

జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలతో మొక్కజొన్న, మినుము, వరి, మిరప, పొగాకు పైర్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వేలాది హెక్టార్లలో సాగు చేసిన మొక్కజొన్న, మినుము, మిరప, పొగాకు పంటలు నీట మునిగి కుళ్లు దశకు చేరుకున్నాయి. పొట్ట, పాలు, కంకి దశల్లో ఉన్న వరిపైర్లు నేలకొరిగాయి. రబీ సీజన్ ఆరంభం కావడంతో పొలాలను చదును చేసుకొని శనగ, మినుము, మొక్కజొన్న పైర్లను సాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్న రైతుల ఆశలపై వర్షం నీళ్లు చల్లింది. వర్షం మరో మూడు రోజులపాటు ఉందంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తుండటంతో పొలాలు ఆరేదెప్పుడు, పంటల సాగు చేసుకునేదెప్పుడంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు.

నంద్యాలకు ఆళ్లగడ్డ కల్చర్ తేవద్దు

- డెయిరీలోకి వచ్చి హల్‌చల్ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదు
- జగత్ విఖ్యాత్‌రెడ్డి డెయిరీకి డీ ఫాల్టర్
- తీసుకున్న అప్పులు తక్షణమే చెల్లించాలి
- అవినీతి ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా సిద్ధమే
- విజయ డెయిరీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): నేరాలు, ఘోరాలతో అభివృద్ధిలో వెనుకబడిన ఆళ్లగడ్డ కల్చర్‌ను ప్రశాంతంగా ఉన్న నంద్యాలకు తేవద్దని విజయడెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్‌రెడ్డి.. ఎమ్మెల్యే అఖిలప్రియకు హితవు పలికారు. రౌడీ గ్యాంగ్‌ను వెంటేసుకొని డెయిరీలోకి వచ్చి హల్‌చల్ చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. స్థానిక విజయ డెయిరీ కార్యాలయంలో బుధవారం డైరెక్టర్లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్టీఆర్ విగ్రహ శిలాఫలకం ఆవిష్కరణను ఓర్వలేని కొందరు.. శిలాఫలకాన్ని మురుగు కాల్వ వద్ద పెట్టి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం దారుణమన్నారు. అఖిలప్రియ అనుచరులే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తమ వద్ద సాక్ష్యాధారాలు ఉన్నాయన్నారు. ఈనెల 18న శిలాఫలకం ఆవిష్కరణకు మంత్రులు, ఎమ్మెల్యేలను ఆహ్వానించడంతోనే అసహనానికి గురైన అఖిలప్రియ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం దుర్మార్గమన్నారు. మహాఘోరం జరిగిపోతుందంటూ ఆమె డెయిరీకి వచ్చి కలరింగ్ ఇచ్చారన్నారు. సోదరుడు విఖ్యాత్‌రెడ్డిని చైర్మన్‌ను చేసేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని, అతడు డెయిరీకి డీఫాల్టర్‌గా ఉన్న విషయాన్ని మరవ వద్దని గుర్తు చేశారు. అప్పటి డెయిరీ చైర్మన్ భూమా నారాయణరెడ్డి నుంచి జగత్ డెయిరీ పాల నాణ్యత చూపి రూ.1.20 కోట్లు రుణం తీసుకొని డీఫాల్టర్‌గా ఉన్న జగత్‌విఖ్యాత్‌రెడ్డి దానిని తిరిగి చెల్లించేంత వరకు డైరెక్టర్ కాలేడన్నారు. జగత్ డెయిరీ నుంచి వచ్చిన పాల నాణ్యత ఎంతో అందరికీ తెలుసన్నారు. అప్పట్లో 30 శాతం మేర డెయిరీ పాల దిగుబడులు పడిపోవడానికి జగత్ డెయిరే కారణమన్నారు. డెయిరీ ఫ్యూర్ ప్రైవేట్ ఆర్గనైజేషన్ డీ ఫాల్టర్‌గా ఉన్న తమరు చైర్మన్ సీట్లో కూర్చుంటే ప్రశ్నించేవారు లేరనుకుంటున్నారా అని మండిపడ్డారు. ఆదాయంలో నడుస్తున్న డెయిరీ జోలికి రావద్దని, డెయిరీలో అవినీతి జరిగితే ఏ విచారణకు అయినా సిద్ధమేనని అన్నారు. తాను రైతు బిడ్డనని, తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని చెప్పారు. నాలుగున్నరేళ్లలో రూ.45 కోట్లు డెయిరీకి ఆదాయాన్ని ఇచ్చానని, పాడిరైతులు, ఉద్యోగులకు తొలిసారిగా బోనస్ ఇచ్చామని తెలిపారు. డెయిరీ అభివృద్ధికి కృషి చేయాల్సింది పక్కన పెట్టి ఉద్యోగులను భయాందోళనకు గురి చేయడం తగదన్నారు. స్వార్థం కోసం ఎన్టీఆర్ ఆత్మను క్షోభ పెట్టవద్దన్నారు. సమావేశంలో డెయిరీ డైరెక్టర్ పీపీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న విజయ డెయిరీ చెర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి

జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుని రాష్ట్రంలోనే జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్థూల దేశీయోత్పత్తి, ఆదాయ వృద్ధిరేట్లపై జిల్లా అధికారులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి ఏటా 15 శాతం గ్రోత్ రేట్ లక్ష్యంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశిస్తున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని పని చేయాలన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగా లు, పారిశ్రామిక రంగాలతోపాటు విద్య, వైద్యం, ఇరిగేషన్ తదితర రంగాలలో అభివృద్ధి నివేదికలు తయారు చేసే విధానంపై నిపుణులతో శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. అంతకుముందు స్థూల దేశీయోత్పత్తి, ఆదాయ వృద్ధిరేట్లపై నంద్యాల మోడల్ స్కూల్ లెక్చరర్ మల్లికార్జునప్ప, బేతంచెర్ల మోడల్ స్కూల్ లెక్చరర్ మరియా దాసు జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

అవే బ్రాండ్లు... అవే రేట్లు

- మందుబాబులకు చంద్రబాబు సర్కార్ ఝలక్
- సరసమైన ధరలకే మద్యం సరఫరా అంటూ హామీ
- అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన వాగ్దానానికి తిలోదకాలు
- నూతన మద్యం పాలసీలో పాత ధరలకే మద్యం విక్రయం

'ఉదయమంతా కష్టపడతారు. సాయంత్రమైతే ఒక పెగ్ వేసుకుని బాధలు మర్చిపోవాలనుకుంటారు. మీకు అండగా నేనుంటా. మేము అధికారంలోకి రాగానే మందు రేట్లు తగ్గిస్తాం. సరసమైన ధరలకే మద్యాన్ని అందుబాటులో ఉంచుతాం' – ఎన్నికల సమయంలో చంద్రబాబు మాటలు ఇవీ!

'మద్యం వ్యాపారం ప్రైవేటుగా నిర్వహిస్తాం. మందుబాబులు కోరుకునే బ్రాండ్లన్నీ అందుబాటులోకి తీసుకువస్తాం. లైసెన్స్‌దారులు ఆర్డర్లు పెట్టిన రకాలనే సరఫరా చేస్తాం. రూ.99కే క్వార్టర్ మద్యాన్ని విక్రయిస్తాం' ఇదీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రుల మాట.

సాక్షి, నంద్యాల: చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు తిలోదకాలిచ్చారు. సరసమైన ధరలకే మద్యాన్ని సరఫరా చేస్తామని, మందుబాబులంతా సంతోషంగా ఉండాలని ఊరువాడా ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీలో రేట్లను చూసి మందుబాబులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాత బ్రాండ్లు, పాత ధరలనే చూసి అవాక్కవుతున్నారు.

రూ.99కే క్వార్టర్ మద్యం ఎక్కడ

జిల్లాలో బుధవారం నుంచి నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రైవేటు దుకాణాదారులు షాపులను ఏర్పాటు చేశారు. 14వ తేదీ నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో పాల్గొని లైసెన్స్‌లు దక్కించుకున్న వారిలో మొదటి రోజు 65 మంది వరకు దుకాణాలను ప్రారంభించారు. వీరికి ఏపీఎస్‌బీసీఎల్ మద్యాన్ని సరఫరా చేయనుంది. అయితే లిక్కర్ డిపోకు వెళ్లిన వారు అక్కడి రేట్లను చూసి షాక్‌కు గురయ్యారు. గత ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయించిన బ్రాండ్లే ఉన్నాయి. ధరల్లో కూడా ఏ మాత్రం మార్పు లేదు. ఇదేంటి ప్రభుత్వం మద్యం రేట్లు తగ్గిస్తామని చెప్పింది కదా అని దుకాణాదారులు అధికారులను ప్రశ్నిస్తే.. ఏమో మాకేం తెలియదు.. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యాన్ని విక్రయిస్తాం. మీకు ఏ బ్రాండ్లు కావాలో చెప్తే వాటినే ఇస్తాం అంటూ చెప్పడంతో దుకాణాదారులు విస్మయానికి గురయ్యారు. మరోవైపు రూ.99కే క్వార్టర్ మద్యం వస్తుందని ఎదురుచూసిన మందుబాబుల ఆశలు అడియాసలయ్యాయి. రూ.99కే క్వార్టర్ సీసాలు ప్రస్తుతానికి జిల్లాకు రాలేదు. ఎప్పుడు వస్తాయో కూడా అధికారులు చెప్పలేని పరిస్థితి. దీంతో పాత బ్రాండ్లు.. పాత ధరలతోనే విక్రయాలు జరగనున్నాయి.

మూతపడిన ప్రభుత్వ దుకాణాలు

కొత్త మద్యం విధానం అమలుల్లోకి రావడంతో ప్రభుత్వ మద్య దుకాణాలను పూర్తిగా మూసేశారు. జిల్లా వ్యాప్తంగా 93 మద్యం దుకాణాలు, 1 లిక్కర్ మార్ట్ ఉండేవి. వీటిని మంగళవారం రాత్రి 9 గంటలకు మూసేశారు. వీటి స్థానంలో 105 మద్యం దుకాణాలకు ప్రభుత్వం కొత్తగా లైసెన్స్‌లు జారీ చేసింది. తొలి రోజు నంద్యాల లిక్కర్ డిపో నుంచి సుమారు రూ.6.58 కోట్ల విలువ చేసే మద్యాన్ని దుకాణాదారులు కొనుగోలు చేశారు.



2 శాతం డ్రగ్ కంట్రోల్ సెస్

షాపులు దక్కించుకున్న వారు నిబంధనల ప్రకారం వార్షిక లైసెన్స్ రుసుములో ఆరో వంతు మొత్తాన్ని చెల్లించారు. దీంతో దుకాణాదారులకు తాత్కాలిక లైసెన్స్ జారీ చేశారు. ఇది ఈనెల 22వ తేదీ వరకు అమలులో ఉంటుంది. షాపులను అద్దెకు తీసుకున్న తర్వాత రెండేళ్ల పాటు అమలులో ఉండే పూర్తి స్థాయి లైసెన్స్ ఇస్తారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం మద్యంపై కొత్తగా మాదకద్రవ్యాల నియంత్రణ సుంకాన్ని విధించింది. ల్యాండెడ్ కాస్ట్‌పై 2 శాతం మేర పన్ను వేయనుంది.

కూటమిలో 'దుకాణం' చిచ్చు!

ఆళ్లగడ్డ: బ్రాందీ షాపుల నిర్వహణ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో జనసేన, టీడీపీ వర్గాల మధ్య చిచ్చుపెడుతున్నాయి. ఇంతవరకు ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఇరిగెల, భూమా వర్గాలకు చెందిన నాయకులు షాపుల నిర్వహణకు సంబంధించి అవసరమైన స్థలాల కోసం యజమానులను బెదిరింపులకు పాల్పడుతుండటంతో ఉద్రిక్తతకు దారి తీస్తోంది. శిరివెళ్ల మండలంలో మొత్తం నాలుగు బ్రాందీ షాపులకు లాటరీ వేయగా అందులో ఇరిగెల వర్గానికి 2, టీడీపీ వర్గానికి 1, ఇతరులకు 1 షాపు వచ్చింది. ఇరిగెల వర్గానికి చెందిన వారు శిరివెళ్ల మండలం ఎర్రగుంట్లలో దుకాణం ప్రారంభించాలని ఎర్రగుంట్ల – వంకినిదిన్నె రహదారిలో ఖాళీగా ఉన్న స్థలాన్ని యజమాని దగ్గర లీజుకు తీసుకున్నారు. ఇందుకు గాను రూ. 15 వేలు అడ్వాన్స్ కూడా చెల్లించినట్లు తెలుస్తోంది. అయితే అదే స్థలంలో దుకాణం పెట్టాలని టీడీపీ నాయకుడు ఆ స్థల యజమానిని బలవంతంగా టీడీపీ నియోజకవర్గ నేత దగ్గరకు తీసుకు పోయాడు. అక్కడ ముందుగా అగ్రిమెంట్ రాసిచ్చిన తేదీ కంటే మరో రెండు రోజులు ముందుగానే టీడీపీ నేతలకు రాసిచ్చినట్లు అగ్రిమెంటు రాయించి సంతకాలు పెట్టించుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇరిగెల వర్గం వారు అక్కడ దుకాణం వేసే ప్రయత్నం చేయగా టీడీపీ నేతలు అడ్డుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. సమాచారం అందుకున్న పోలీసులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించి వేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వివాదం పెద్దదై శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడుతుందని అక్కడ ఎవరూ షాపు ఏర్పాటు చేయకుండా పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

వైన్ షాపు నిర్వాహకులకు ఎమ్మెల్యే బుడ్డా బెదిరింపులు

బండిఆత్మకూరు మండలంలోని సంతజూటూరు వైన్ షాప్ (నెంబర్.16) ఈర్నపాడుకు చెందిన పిట్టం రాజశేఖర్ రెడ్డికి దక్కింది. దీంతో ఆయన నిబంధనల మేరకు లైసెన్స్ ఫీజులో ఆరో వంతు కట్టేసి తాత్కాలిక లైసెన్స్ తెచ్చుకున్నారు. బుధవారం స్థానికంగా దుకాణం కోసం ఒక అద్దె భవనాన్ని ఎంచుకుని యజమానితో మాట్లాడారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ యజమానిని స్టేషన్‌కు పిలిపించి దుకాణానికి అద్దెకు ఎందుకు ఇచ్చావ్.. అద్దెకు ఇస్తే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించినట్లు తెలిసింది. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాలతోనే ఎస్ఐ ఈ విధంగా మాట్లాడినట్లు టీడీపీ నాయకులే చెబుతున్నారు. ఎస్ఐ బెదిరింపులతో భవనాన్ని అద్దెకు ఇవ్వడానికి యజమాని ముందుకు రాకపోవడంతో నిర్వాహకులు మరో షాపును తీసుకుని సాయంత్రం ఓపెన్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న బుడ్డా నేరుగా రంగంలోకి దిగి నిర్వాహకులు తనతో మాట్లాడిన తర్వాతే షాపును ప్రారంభించాలని లేకుంటే నీ దుకాణమే ఉండదని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధులే ఇలా బహిరంగంగా బెదిరింపులకు పాల్పడితే వ్యాపారం ఎలా చేసుకోవాలో అర్థంకావడం లేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

భార్యను చంపిన కేసులో భర్త అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

గోనెగండ్ల: మండల పరిధిలోని కులుమాల గ్రామంలో భార్యను చంపిన కేసులో భర్తను పోలీసులు అరెస్టు చేశారు.మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని ఈనెల 13వ తేది రాత్రి భార్య కృష్ణవేణిని భర్త కురువ పక్కీరప్ప రాయితో కొట్టి హత్య చేసిన విషయం తెలిసిందే. దీనిపై మృతురాలి తండ్రి భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు చిన్నమరివీడు గ్రామం దారిలోని నల్ల పోచమ్మ దేవాలయం దగ్గర ఉండగా అరెస్టు చేశారు. బుధవారం సీఐ గంగాధర్ నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. అరెస్టు చేసిన పక్కీరప్పను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

యువతి మృతదేహం లభ్యం

పాణ్యం: ఈనెల 13న ఎస్సార్బీసీ ప్రధాన కాల్వలో ప్రమాదవశాత్తూ గల్లంతైన యువతి బుధవారం బనగానపల్లె మండలం రవ్వకొండ వద్ద శవమై కనిపించింది. ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపిన వివరాలు.. గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన జార్జి, అతని భార్య వెన్నెల(18) కుటుంబ సభ్యులతో కలిసి రేణిగుంటలో పని ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో పాణ్యం ఎసార్బీసీ ప్రధాన కాల్వలో స్నానాలు చేసే క్రమంల వెన్నెల ప్రమాదవశాత్తూ కాలు జారి నీటిలో కొట్టుకుపోయింది. మూడు రోజులుగా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. రవ్వలకొండ వద్ద కాల్వలో మృతదేహం కనిపించడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వారి సమాచారంతో పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కేసీకి తగ్గిన నీటి విడుదల

కర్నూలు సిటీ: కర్నూలు–కడప కాలువకు నీటి విడుదలను తగ్గించారు. వాతావరణంలో మార్పులు కారణంగా జిల్లాతో పాటు నంద్యాల, కడప జిల్లాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా నీటిని పంటలకు పెట్టేందుకు ఆయకట్టుదారులు ఆసక్తి చూపకపోవడంతో ఇంజినీర్లు నీటి విడుదలను బుధవారం 1540 క్యూసెక్కుల నుంచి 1058 క్యూసెక్కులకు తగ్గించారు. సుంకేసులకు 35,780 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో 34,216 క్యూసెక్కుల 8 గేట్లు పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

తక్కువ ధరతో రైతులకు టార్పాలిన్‌లు

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెట్ ధర కంటే తక్కువ ధరతో రైతులకు టార్పాలిన్‌లు పంపిణీ చేస్తున్నట్లుగా జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ బిజినెస్ మేనేజర్ రాజేష్ తెలిపారు. నాణ్యత కలిగిన టార్పాలిన్‌లను కర్నూలు, కోడుమూరు, దేవనకొండ, పత్తికొండ, ఎమ్మిగనూరు డీసీఎంసీ బ్రాంచ్‌లలో రైతులకు అందుబాటులో ఉంచినట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిగ్‌బుల్ కంపెనీకి చెందిన 18 అడుగుల వెడల్పు, 24 అడుగుల పొడవు కలిగి 250 జీఎస్‌ఎం మందం కలిగిన టార్పాలిన్‌లను రూ.1600 ప్రకారం రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నిత్యం ఉపయోగపడే టార్పాలిన్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

22న జాబ్ మేళా

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 22న శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టాటా, టెల్ కమ్యూనికేషన్, బిగ్ బాస్కెట్, శ్రీరామ్ చిట్స్, కిసాన్ అగ్రి అండ్ కో ప్రతినిధులు హాజరై తమకు కావాల్సిన వారిని ఎంపిక చేసుకుంటారన్నారు. పదవ తరగతి, ఐటీఐ, డిప్లమా, ఇంటర్ పీజీ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్ల వయస్సున్న అభ్యర్థులు అర్హులన్నారు. మరింత సమాచారం కోసం 7673902328ను సంప్రదించాలన్నారు.

మోగిన పెళ్లి బాజా!

- ప్రారంభమైన శుభకార్యాలు
- పెళ్లి పనుల్లో వధూవరుల తరఫు వారు బిజీ
- కిటకిటలాడుతున్న వస్త్ర, బంగారు దుకాణాలు
- కళకళలాడుతున్న కళ్యాణ మండపాలు
- ఒక్కటి కానున్న వేల జంటలు



కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరి జీవితంలో పెళ్లి ఓ మధురానుభూతి. అందుకే అందరూ మెచ్చేలా అత్యంత వైభవంగా జరుపుకోవాలని చూస్తారు. ఈనెల 13 నుంచి శుభకార్యాలకు మంచి సమయం కావడంతో పిల్లలను పెళ్లి చేసి ఒక ఇంటి వాళ్లను చేసే పనిలో తల్లిదండ్రులు బిజీ అయ్యారు. దీంతో పట్టణం..పల్లె అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా పెళ్లిళ్ల హడావుడి కనిపిస్తోంది. ఊరూరా బాజాభజంత్రీలు మోగుతున్నాయి. ఈ రెండు మూడు నెలల్లోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేల జంటలు ఒక్కటి కానున్నాయి.

ట్రెండ్ మారింది గురూ

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వస్త్ర, బంగారు దుకాణాలు కొది రోజులుగా కిటకిటలాడుతున్నాయి. దసరా షాపింగ్‌తో పాటు వివాహాలకు సంబంధించిన కొనుగోళ్లతో దుకాణాలు సందడిగా దర్శనమిస్తున్నాయి. వధూవరుల బంధుమిత్రులతో దుకాణాలు నిండిపోతున్నాయి. సంపన్నులైతే పెళ్లిళ్ల కోసం రూ.లక్షల్లో ఖర్చులు చేస్తున్నారు. గ్రామాలకు చెందిన యువత సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడడంతో ఖర్చుకు వెనకాడడం లేదు. గతంలో వివాహ వేడుకలంటే బ్యాండ్ మేళాలు, భాజా భజంత్రీలు, పూల మండపాలు, వీడియో షూటింగ్‌లు వంటివి చాల సాధారణంగా ఉండేవి. ఇప్పుడు ట్రెండ్ మారింది. వివాహ ముహూర్తానికి ముందే సంగీత్ కార్యక్రమాలు నిర్వహించడం, ప్రీ వెడ్డింగ్ షూట్లకు ఇతర ప్రాంతాల లొకేషన్లకు, ప్రకృతి, చారిత్రక ప్రాంతాలకు వెళ్తున్నారు. సినిమాటిక్‌గా వధూవరులచే స్పెషల్ సాంగ్స్ రూపకల్పన చేసి అవి ముందుగానే సోషల్ మీడియాలో విడుదల చేయడం, కల్యాణ వేదికపై ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌లపై ప్రదర్శించడం ఇలా విభిన్నంగా వేడుకను చేసుకునేందుకు కొందరు ఇష్టపడుతున్నారు.

పెళ్లి ముహూర్తాలు ఇలా..

- అక్టోబర్ ఆశ్వయుజ మాసంలో 16, 17, 18, 20, 23, 26, 27
- నవంబర్ కార్తీక మాసంలో 3, 7, 8, 10, 13, 14, 16, 17, 20, 22, 27, 28
- డిసెంబర్ మార్గ శిర మాసంలో 4, 5, 6,7, 8, 11,12, 14, 15, 20, 21, 26, 26, 27, 28
- 2025 జనవరి మాఘ మాసం 31
- ఫిబ్రవరి మాఘ మాసంలో 2, 6, 7, 8,9, 12,13, 14, 15, 16, 21, 22, 22, 23, 26
- మార్చి ఫాల్గుణ మాసంలో 2, 6,9, 12, 15, 16



ఆకట్టుకునేలా కల్యాణ వేదిక

ఫంక్షన్ హాళ్లకు ఫుల్ డిమాండ్

వరుసగా పెళ్లిముహూర్తాలు ఉండటంతో కల్యాణ మండపాలకు కూడా బాగా డిమాండ్ పెరిగింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న సుమారు 2200 కల్యాణ మండపాలు, దేవాలయాల్లో ఉన్న హాల్స్ అన్నీ బుక్ అయ్యాయి. ఫంక్షన్ హాల్‌ను బట్టి రూ.60 వేల నుంచి రూ. 2 లక్షల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. ఇవి కాక పూల డెకరేషన్, లైటింగ్ వంటి పనులు చేస్తున్న వారికి చేతి నిండా పనులు లభిస్తున్నాయి. బోటిక్స్, బ్యూటీషియన్లకు డిమాండ్ పెరిగింది. వారికి రూ. వేలల్లో చెల్లిస్తున్నారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఫుడ్ క్యాటరింగ్ చేస్తున్న వారు విందు వంటకాల తయారీలో మునిగిపోయారు.

పెళ్లి పనుల్లో బిజీ

వధూవరుల తరపు వారు పెండ్లి పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. నిర్ణయించుకున్న ముహూర్తాలను బట్టి ఆహ్వాన పత్రిక ప్రింటింగ్ మొదలు కొని బంధు మిత్రులను ఆహ్వానించడం, ఆడ పడుచుల ఆహ్వానాలు, షాపింగ్ పనులు, పెళ్లి ఇళ్ల డెకరేషన్, సంగీత్, మెహందీ ఫంక్షన్, మంగళ స్నానాల వేదిక ముస్తాబు, మితాయిల తయారీలతో తీరిక లేకుండా గడపుతున్నారు.

ముందుగానే బుక్ చేసుకుంటున్నారు



అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు వరుసగా పెళ్లి ముహూర్తాలు ఉండటంతో వధూవరుల తల్లిదండ్రులు వారి బడ్జెట్‌కు తగిన విధంగా ముందుగానే కల్యాణ మండపాలను బుక్ చేసుకుంటున్నారు. కల్యాణ మండపాలకు బాగా డిమాండ్ ఉంది. ఇప్పటికే కొన్ని ముహుర్తాలకు ఫంక్షన్ హాల్ బుక్ అయ్యింది.

– మాకా అశోక్‌కుమార్, సత్యసాయి కల్యాణ మండపం నిర్వాహకులు

ఆర్డర్లు బాగున్నాయి



ప్రస్తుతం పెళ్లి ముహూర్తాలు ఎక్కువగా ఉండటంతో ఆర్డర్లు బాగున్నాయి. ఈ సీజన్‌లో ఎక్కువ పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉంది. క్యాటరింగ్‌కు మంచి డిమాండ్ వచ్చింది. మా దగ్గర పనిచేసే వంట మాస్టర్లు, సిబ్బందికి చేతి నిండా ఉపాధి దొరుకుతుంది. పెళ్లి నిర్వాహకుల బడ్జెట్‌ను బంటి మెనూ ఉంటుంది.

– ప్రేమ్, క్యాటరింగ్ నిర్వాహకులు, కర్నూలు

ముగిసిన బన్ని ఉత్సవాలు

- నెరణికి గ్రామానికి చేరిన మాళమల్లేశ్వర ఉత్సవ విగ్రహాలు
- బన్ని ఆడిన చిన్నారులు



నెరణికి గ్రామానికి చేరిన దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు

హొళగుంద: రాష్ట్రంలోనే ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టు దసరా బన్ని ఉత్సవాలు బుధవారం ముగిశాయి. దేవరగట్టులో కంకణ విసర్జన అనంతరం కాడ సిద్ధప్ప మఠంలో ఉంచిన ఉత్సవ మూర్తులకు ఆలయ పూజార్లు మహామంగళారతి, అభిషేకలు ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గొరవయ్యలు విగ్రహాలను, పల్లకీని భక్తి శ్రద్ధలతో నెరణికి గ్రామానికి మోసుకెళ్లారు.

నెరణికిలో దసరా వేడుకలు

విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరడంతో పండుగ వాతవరణం నెలకొంది. విజయదశమి రోజు కాకుండా బన్ని ఉత్సవాలనంతరం ఈ గ్రామంలో దసరా వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. దేవరగట్టు నుంచి గ్రామానికి చేరిన విగ్రహాలను ఆంజనేయస్వామి ఆలయం ముందు కొలువుంచి మహామంగళ హారతి, ఇతర పూజలు చేశారు. తర్వాత గ్రామస్తులు ఆలయం నుంచి విగ్రహాలను అర్చకుల ఇంటి వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చిన్నారులు 'బన్ని' (కర్రలు పట్టుకుని ఎగరడం) ఆడారు. మాళమల్లేశ్వరుని కంకణధారణ నుంచి నిష్టతో ఉన్న గ్రామస్తులు ఉత్సవాల ముగింపుతో దీక్షను విరమించారు. బన్ని ఉత్సవం సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య నేతృత్వంలో పోలీసు బందోబస్తు చేపట్టారు. అలాగే ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయం కోసం..

- భర్త ఇంటి ముందు భార్య ధర్నా



భర్త ఇంటి ఎదుట పిల్లలతో ధర్నా చేస్తున్న రాజేశ్వరి

ఎమ్మిగనూరు రూరల్: తనకు న్యాయం చేయాలంటూ మండలంలోని గుడికల్ గ్రామంలో బుధవారం భర్త ఇంటి ముందు భార్య పిల్లలతో ధర్నా చేపట్టింది. వివరాలు.. గ్రామంలో నివాసం ఉంటున్న సురేష్‌కు ఎమ్మిగనూరుకు చెందిన రాజేశ్వరి అనే మహిళతో ఎనిమిదేళ్ల క్రితం పెద్దలు వివాహం చేశారు. రెండు సంవత్సరాల పాటు సజావుగా సాగిన వీరి సంసారంలో ముగ్గురు పిల్లలు అయ్యారు. ఇంతలో ఏం జరిగిందో కాని భర్త తన భార్య, పిల్లల్ని పట్టించుకోవడం మానేశాడు. నిత్యం మద్యం తాగొచ్చి తనను వేధిస్తున్నాడని రాజేశ్వరి వాపోవడంతో కొన్ని రోజుల క్రితం మహిళ సంఘం నాయకులు జోక్యం చేసుకుని ఇద్దరికి సర్దిచెప్పారు. రెండు రోజులు బాగుండి మళ్లీ భార్య, పిల్లల్ని పట్టించుకోవడం మానేశాడు. దీంతో తనకు, పిల్లలకు బతికేందుకు ఏదైనా దారి చూపాలని రాజేశ్వరి బుధవారం భర్త ఇంటి ముందు ధర్నాకు దిగింది. చివరకు కాలనీ వాసులు జోక్యం చేసుకుని మరో సారి పునరావృతమైతే పోలీసులకు ఫిర్యాదు చేయిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించినట్లు బాధితురాలు తెలిపారు.

నిలిచిన విమాన రాకపోకలు

ఓర్వకల్లు: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఎయిర్ పోర్టుకు బుధవారం విమాన రాకపోకలు నిలిచిపోయ్యాయి. సాధారణంగా ప్రతి బుధ, శుక్ర, ఆదివారాల్లో ఉదయం 10.30 గంటలకు బెంగళూరు నుంచి ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు విమానం వస్తుంది. ప్రస్తుతం తుపాను ప్రభావంతో వాతావరణం అనుకూలించక బెంగులూరు ఎయిర్ పోర్టు అధికారులు సర్వీసును రద్దు చేసినట్లు ఓర్వకల్లు ఎయిర్ పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్ తెలిపారు.

ఎస్‌ఐ చొరవతో తాత్కాలిక పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్



వివాదాస్పద వంక పరిశీలిస్తున్న ఎస్‌ఐ రమేష్‌రెడ్డి

చాగలమర్రి: స్థానిక ఎస్‌ఐ రమేష్ రెడ్డి చొరవతో డి.కొత్తపల్లె గ్రామంలో నెలకొన్న రహదారి సమస్య తాత్కాలికంగా పరిష్కారమైంది. టీడీపీ నేత ఒకరు వంకను ఆక్రమించడంతో పొలాలకు, శ్మశాన వాటికలకు వెళ్లేందుకు సమస్యగా మారింది. ఇదే విషయాన్ని ఈనెల 6న 'అమ్మ నా తమ్ముడా' అంటూ సాక్షి ప్రచురించిన కథనానికి ఎస్‌ఐ స్పందించి బుధవారం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గ్రామస్తులతో కలిసి ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యను మైనర్ ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారు రెవెన్యూ రికార్డులను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపుతారని, అంతవరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా ఆక్రమణలను తొలగించామని వివరించారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

కర్నూలు న్యూసిటీ: జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో ప్రజలకు అందుబాటులో ఉండి విద్యుత్ సంబంధ సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఉమాపతి సిబ్బందిని ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రంతో పాటు కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు డివిజన్లలో విద్యుత్ సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి వద్ద 24 గంటలు అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉంటారన్నారు.అవసరమైన వారు టోల్ ఫ్రీ నెంబర్ 1912 లేదా 18004251553333కు ఫోన్ చేసి సమస్య తెలియజేయాలని బుధవారం ఓ ప్రకటనలో కోరారు.

జాతీయ క్రీడలకు ఆర్‌జీఎం విద్యార్థి



వేణు

పాణ్యం: తమ కళాశాల విద్యార్థి జి.వేణు సౌత్ జోన్ జాతీయ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడని ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం విద్యార్థిని జేఎస్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి జోజిరెడ్డి, చెర్మన్ శాంతిరాముడు, పీడీ వెంకటేష్‌తో కలిసి ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇటీవల కుప్పం యూనివర్సిటీలో జరిగిన సౌత్‌జోన్ ఎంపిక పోటీల్లో వేణు ప్రతిభ కనబరిచి డిసెంబర్‌లో చెన్నైలోని అలగప్ప యూనివర్సిటీలో నిర్వహించనున్న పోటీలకు ఎంపిక కావడం తమ కళాశాలకు గర్వకారణమన్నారు.

నేటి నుంచి ఉర్దూ యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో కన్వీనర్ కోటా కింద పరిమిత సంఖ్యలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ తెలిపారు. పీజీ కోర్సుల్లో ఎంఏ ఇంగ్లిష్, ఎకనామిక్స్, ఉర్దూ, ఎమ్మెస్సీ జువాలజీ, ఇండస్ట్రియల్ కెమిస్ట్రీలో స్పాట్ అడ్మిషన్ల కింద చేర్చుకునేందుకు ప్రభుత్వ అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకు విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వర్సిటీ కార్యాలయంలో హాజరు కావాలని పేర్కొన్నారు. ఉన్నత విద్యా మండలి నిబంధనల ప్రకారం అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. అమ్మాయిలకు యూనివర్సిటీలో హాస్టల్ వసతి, అబ్బాయిలకు నగరంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో వసతి సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 83415 11632, 99597 58609ను సంప్రదించాలన్నారు.

బతికున్న వ్యక్తికి మరణ ధ్రువీకరణ పత్రం

- పెద్దాసుపత్రిలో ఇచ్చినట్లుగా నకిలీ ధ్రువీకరణ పత్రం
- లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన కుటుంబసభ్యులు

కర్నూలు(హాస్పిటల్): ఓ వ్యక్తి బతికి ఉన్నా చనిపోయినట్లుగా మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేసిన ఉదంతమిది. అతను బతికే ఉన్నాడని కానీ మరణించినట్లు సర్టిఫికెట్ ఇచ్చారని కుటుంబసభ్యులు లోకాయుక్తను ఆశ్రయించారు. దీంతో ఈ విషయమై వివరణ ఇవ్వాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అధికారులతో పాటు మండల రెవిన్యూ అధికారులకు లోకాయుక్త నోటీసులు జారీ చేసింది. గూడూరు మండలం బూడిదపాడు గ్రామానికి చెందిన భట్టు పెద్ద మాదన్న కుమారుడు భట్టు కృష్ణమూర్తి(65) మరణించినట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జారీ చేసినట్లు ఇటీవల మరణ ధ్రువీకరణ పత్రం జారీ అయ్యింది. ఈ మేరకు పత్రంలో ఆసుపత్రి అధికారుల సంతకాలు సైతం ఉన్నాయి. ఈ విషయం తెలిసి కృష్ణమూర్తి కుటుంబసభ్యులు హతుశులయ్యారు. ఆయన బతికే ఉన్నాడని చనిపోయినట్లు సర్టిఫికెట్ ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ న్యాయవాది ద్వారా లోకాయుక్తను ఆశ్రయించారు. ఈ మేరకు లోకాయుక్త అధికారులు ఇటీవల కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అధికారులతో పాటు మండల రెవెన్యూ అధికారులను వివరణ కోరారు. అయితే ఇది నకిలీ సర్టిఫికెట్ అని, తాము జారీ చేసే సిరీస్ నెంబర్‌కు ఈ సిరీస్ నెంబర్‌కు తేడా ఉందని వివరణ ఇచ్చారు. ఈ మేరకు ఆసుపత్రి అధికారులు మూడవ పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వగా అది తమ పరిధిలోకి రాదని చెప్పినట్లు సమాచారం. అయితే ఐదేళ్ల క్రితం కూడా ఆసుపత్రిలోని కొందరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు అధికారుల డిజిటల్ సంతకాలు, యూజర్ నేమ్, ఐడీ ఆధారంగా నకిలీ బర్త్ సర్టిఫికెట్లు జారీ చేశారు. ఈ విషయంలో సదరు ఉద్యోగులను అప్పటి అధికారులు విధుల నుంచి తొలగించారు. మళ్లీ ఇంత కాలానికి అచ్చు ఆసుపత్రిలో జారీ చేసినట్లు ఉండే మరణ ధ్రువీకరణ పత్రం బయటపడటం కలకలం సృష్టిస్తోంది.

మందుబాబులకు జైలు శిక్ష

ఉయ్యాలవాడ: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరికి కోవెలకుంట్ల జూనియర్ సివిల్ కోర్టు జైలు శిక్ష విధించింది. ఎస్‌ఐ రామాంజనేయులురెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని పెద్దయమ్మనూరు కుందరవాగు బ్రిడ్జిపై బుధవారం తెల్లవారుజామున పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అతి వేగంగా వాహనం నడుపుతూ వస్తున్న ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన బైరి ప్రసాద్, నాగెళ్ల సునీల్‌లను ఆపి బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేయగా మద్యం తాగినట్లు నిర్ధారణ అయింది. వారిని అరెస్ట్ చేసి, కోవెలకుంట్ల జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పరచగా జడ్జి షేక్ అబ్దుల్ రహిమాన్ 30 రోజుల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక లారీ సీజ్



హొళగుంద: ఆంధ్ర సరిహద్దులోని మార్లమడికి వద్ద ఉన్న వేదావతి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని బుధవారం హొళగుంద పోలీసులు స్థానిక ఎల్లెల్సీ బ్రిడ్జ్ వద్ద పట్టుకున్నారు. సీజ్ చేసిన లారీని మైనింగ్ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్‌ఐ బాల నరసింహులు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమాన్‌పురం గ్రామానికి చెందిన సలీంద్ర మధు(35) బుధవారం అప్పుల బాధతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. సలీంద్ర మధు తనకు ఉన్న 3.50 ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. పంటల సాగు కోసం సుమారు రూ.5 లక్షల దాకా అప్పు చేశాడు. వాటిని తీర్చే మార్గం లేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య సంధ్యాదేవి, ఏడాది వయస్సు ఉన్న కుమారుడు ఉన్నారు.

తెలుగుగంగలో విద్యార్థి గల్లంతు



గౌతమ్ సిద్ధార్థ(ఫైల్)

మహానంది: స్థానిక ఈశ్వర్‌నగర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి గౌతమ్ సిద్ధార్థ(17) తెలుగు గంగ కాల్వ(బరగొడ్ల బ్రిడ్జి)లో గల్లంతయ్యాడు. వర్షం పడుతుండటంతో కుటుంబ సభ్యుల సూచనలతో బుధవారం కళాశాలకు వెళ్లకుండా మేకలు మేపేందుకు వెళ్లాడు. ఈక్రమంలో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు తెలుగు గంగ కాల్వలోకి దిగిన విద్యార్థి నీటి ఉధృతికి కొట్టుకునిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం తనిఖీ



వసతి గృహం తనిఖీ చేస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి గార్గేయపురంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని సౌకర్యాలు, ఆహార నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించారు. అలాగే వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఏవైనా లోపాలు ఉంటే వాటి మీద అవసరమైన చర్యలు తీసుకోవడానికి సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

ఎక్కడంటే అక్కడే తాగాలి.. ఊగాలి







ఓపెన్‌బార్.. నగరంలో వివిధ మద్యం దుకాణాల వద్దే తాగుతున్న దృశ్యం

తాము అధికారంలోకి వస్తే సరసమైన ధరలకే మద్యమని ఎన్నికల ముందు కూటమి సర్కారు ప్రచారం చేసింది. నమ్మి ఓటేసిన మందుబాబులకు నూతన మద్యం పాలసీ ప్రారంభించిన తొలిరోజే షాక్ ఇచ్చింది. తక్కువ ధరకే అన్ని రకాల లిక్కర్ దొరుకుతుందని బుధవారం ఉదయాన్నే షాపుల వద్దకు వెళ్లిన వారు రేట్లు చూసి బిత్తరపోయారు. బ్రాండ్లు లేకపోగా పాత ధరలే ఉండటంతో నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. మరికొందరు చెప్పేదొకటి చేసేదొకటి అని ప్రభుత్వంపై దుమ్మెత్తిపోశారు. ఇదిలా ఉంటే కౌంటర్ సేల్స్ చేపట్టాల్సిన మద్యం షాపుల వద్దే ఓపెన్ బార్‌లా తాగుతున్న దృశ్యాలు కనిపించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



దుకాణం తెరిచారు.. చెన్నమ్మ సర్కిల్ వద్ద కొనుగోలుదారులతో కిక్కిరిసిన మద్యంషాపు



ఇదేం ధర బాబు.. మద్యం బాటిళ్లపై ఎమ్మార్పీ చూసుకుంటున్న మందుబాబు